క్లుప్తంగా

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ప్రకృతి అందాల మధ్య ప్రజాప్రతినిధుల బోటింగ్



బోటులో ప్రయాణిస్తున్న మంత్రి భట్టి, ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: కృష్ణానదిలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బోటు షికారు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం భట్టి కొల్లాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సోమశిల వద్ద కృష్ణానదిలో మంత్రులు భట్టి, జూపల్లి కృష్ణారావ్, ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు బోటులో షికారు చేశారు. సోమశిల అందాలను ఆస్వాదించారు.

ఆధ్యాత్మికతతో భక్తిభావం



కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భక్తుడు రమేశ్

కడ్తాల్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావం పెంపొందుతుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధి మైసిగండి గ్రామంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం గతేడాది ఉత్సవాల్లో పెద్ద వినాయకుడి లడ్డును రూ.3.50 లక్షలకు కైవసం చేసుకున్న జాటవత్ రమేశ్ నాయక్.. సంబంధిత నగదును చెక్కు రూపంలో కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హీరాసింగ్, మాజీ సర్పంచ్ తులసీరాం, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, నాయకులు జవహర్‌లాల్, రాందాస్‌నాయక్, కిషన్, తులసిరాం భోని శంకర్ ఉన్నారు.

గుంతలు తీశారు.. కనెక్షన్లు మరిచారు



సమావేశంలో మాట్లాడుతున్న కాలనీ వాసులు

ఆమనగల్లు: ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తామని మూడేళ్ల క్రితం గుంతలు తీశారు. కానీ నేటి వరకు కనెక్షన్లు ఇవ్వలేదు అని విద్యానగర్ కాలనీలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ఎ.పాషఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాల కల్పనతో పాటు.. భగీరథ నీటిని అందించాలని కోరారు. సమావేశంలో కాలనీ వాసులు రాములు, అంకయ్య, మల్లయ్య, రఘుమాచారి, సిరాజ్ ఉన్నారు.

కూడలిలో బెంచీల ఏర్పాటు



బెంచీలు ఏర్పాటు చేయిస్తున్న దాత శ్రీశైలం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం.. గ్రామంలోని పలు కూడళ్లలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భిక్షపతి, నర్సింహ, కృష్ణయ్య, సత్యం, రమేశ్, శ్రీను, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నేతల విరాళం

కడ్తాల్: ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం అపర్ణ పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.2.50 లక్షలు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ రూ.1.50 లక్షల విరాళంను శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు యాదయ్య, సత్యనారాయణ, బాలయ్య, బుచ్చయ్య, మహేశ్, జంగయ్య, నర్సింహ, శేఖర్, కృష్ణ, రమేశ్, లాయక్‌అలీ, వెంకటేశ్, సైదులు పాల్గొన్నారు.

హైవేపై ప్రయాణం హడల్



సాగర్ రోడ్డుపై బుద్ధ విగ్రహం వద్ద యూటర్న్

- ప్రమాదకరంగా యూటర్న్‌లు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు

తుర్కయంజాల్: జాతీయ రహదారిపై ఉన్న యూటర్న్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. సాగర్ రోడ్డు మాసబ్ చెరువు కట్టపై బుద్ధ విగ్రహం, జేబీ క్రికెట్ మైదానం సమీపంలోని యూటర్న్‌ల వద్ద చోటుచేసుకుంటున్న వరుస యాక్సిడెంట్లతో వాహనదారులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు.

రద్దీ ఎక్కువ

మాసబ్ చెరువు కట్టపై ఉన్న పార్కులో ఆహ్లాదం పొందేందుకు నిత్యం వేళల్లో సందర్శకులు వస్తుంటారు. వారితో పాటు కమ్మగూడ కట్ట కింద ఉన్న ఇందిరమ్మ కాలనీ, సుందరయ్యనగర్ కాలనీ, లక్ష్మీనగర్, శ్రీ శ్రీనివాస కాలనీ, శివాజీనగర్, సాయి ప్రియనగర్, శ్రీరంగాపురం, సాయినాథ్ కాలనీ వాసులతో పాటు కమ్మగూడ, ఇంజాపూర్ తదితర ప్రాంత వాహనదారులు సాగర్ రోడ్డుపైన యూ టర్న్ తీసుకుంటారు. ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌కు వచ్చే వాహనాలతో పాటు, నలువైపుల నుంచి వచ్చే వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ సమయంలో యూటర్న్ తీసుకునే వారితో తరచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి.

బారికేడ్లు ఏర్పాటు చేయాలి

అత్యంత ప్రమాదకరంగా మారిన రెండు యూటర్న్‌లను తక్షణమే మూసివేయాలి. మరో చోట ఏర్పాటు చేయాలి. ఒక వేళ వీటిని ఇలాగే కొనసాగించాల్సి వస్తే.. బారికేడ్లను ఏర్పాటు చేసి, వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి.

– ఐలయ్య, తుర్కయంజాల్

ప్రమాదాల నివారణకు చర్యలు

సాగర్ రోడ్డుపై ఉన్న రెండు యూటర్న్‌లను తొలుత పరిశీలిస్తాం. స్థానికుల అభిప్రాయాలను తీసుకుంటాం. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటాం. రోడ్డు దాటే సమయంలో వాహనదారులు, పాదచారులు జాగ్రత్తగా ఉండాలి.

– కె.నర్సింహ్మారెడ్డి, ట్రాఫిక్ సీఐ, ఇబ్రహీంపట్నం

కమ్మగూడ జేబీ క్రికెట్ గ్రౌండ్ యూటర్న్ వద్ద అదే పరిస్థితి. రెండు రోజుల క్రితం రోడ్డు ఇదే ప్రాంతంలో ఓ ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. జూలై 27న రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎస్.కనకయ్య(45)ను ఓ ట్రావెల్ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఏప్రిల్ 21న రాత్రి రోడ్డు దాటుతున్న వ్యక్తి(50)ని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి.. చికిత్స పొందుతూ దుర్మరణం చెందాడు.

తల్లిదండ్రులను గౌరవించాలి



తల్లిదండ్రుల పాద పూజలో విద్యార్థులు

ఏఈఓ సర్దార్ నాయక్

మాడ్గుల: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని ఏఈఓ సర్దార్ నాయక్ అన్నారు. మండల పరిధి అవురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా కొనసాగుతున్న సంస్కార వికాస సాధన- యోగ విజ్ఞాన శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ, కన్నవారు.. తమ పిల్లలకు సర్వం ధారపోస్తారని తెలిపారు. దానిని గుర్తించి విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని, తద్వారా సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. రోజురోజుకూ పడిపోతున్న మానవ విలువల పునరుద్ధరణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య రమేష్ గురూజీ, వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు మాధవరెడ్డి, నర్సిరెడ్డి, జీఆహెచ్ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పు కోసమే ఒప్పందం

గురునానక్ వర్సిటీ చాన్స్‌లర్ కోహ్లి

ఇబ్రహీంపట్నం: విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పు కోసం బీఎస్ఎన్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని గురునానక్ యూనివర్సిటీ చాన్స్‌లర్ కోహ్లి, డైరెక్టర్ సైనీ అన్నారు. శనివారం గురునానక్ విద్యాసంస్థ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మధ్య రీసెర్చ్, ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపనపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. బీఎస్ఎన్ఎల్ ఐబీ, టీబీ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం.సత్యప్రసాద్, గురునానక్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్, వీసీ డాక్టర్ హెచ్ఎస్ సైనీ ఈ కీలక ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ప్రకారం వైర్డ్ యాక్సెస్ టెక్నాలజీ ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను నిర్మించి ఏఐ, ఐఓటీ, ఎంటూఎంకు సంబంధించి ఇంటర్ స్ప్లైస్ టెస్టింగ్‌కు ఉపయుక్తంగా మారుతుందన్నారు. రాబోయే కాలంలో ఇండస్ట్రీ 4.0 అప్లికేషన్లకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఇది విద్యార్థులు, సాంకేతిక నిపుణులతో కలిసి పనిచేసే చారిత్రాత్మక నిర్మాణానికి నాంది పలుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆర్ అండ్ డీ ఎస్‌వీ రంగనాయకులు, ప్రొఫెసర్ ఎంపీ సింగ్ ఇషార్, డైరెక్టర్ కలైరాసన్, రిజిస్ట్రార్ విశాల్ వాలియా, డైరెక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, సంజీవ్ శ్రీవాస్తవ, హరీశ్‌కుంద్రా, జాయింట్ డైరెక్టర్ పార్థసారథి, ప్రిన్సిపాల్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



బీఎస్ఎన్ఎల్, గురునానక్ విద్యాసంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రతినిధులు

పాదచారులకు దారేది?



రద్దీగా ఉన్న తుక్కుగూడ బస్టాండ్ పరిసరాలు

హైవేపై దూసుకుపోతున్న వాహనాలు

- రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా పార్కింగ్
- కొనసాగుతున్న చిరువ్యాపారాలు

తుక్కుగూడ: శ్రీశైలం జాతీయ రహదారి పై పెరుగుతున్న వాహనాల రద్దీతో రోడ్డు దాటడానికి బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. పుర పరిధి దేవేందర్‌నగర్ కాలనీ నుంచి మహేశ్వరం గేటు వరకు ఇదే పరిస్థితి. రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్, చిరువ్యాపారుల ఆక్రమణతో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

వంతెన నిర్మిస్తే మేలు

శ్రీశైలం హైవేపై నిత్యం ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్, శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వందల వాహనాలు పరుగులు తీస్తుంటాయి. వీటికి తోడు తుక్కుగూడ పరిసర ప్రాంతంలో హార్డువేరు పార్క్, ఈ– సిటీ, వండర్‌లా వినోద కేంద్రం, కలెక్టర్ సముదాయం ఉండటంతో ప్రాంతీయుల రాకపోకలతో రహదారి రద్దీగా ఉంటుంది. ఇక రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌తో కాలి నడకన వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు దాటాలంటే భయాందోళన చెందుతున్నారు. తుక్కుగూడ బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే అందరికీ మేలని స్థానికులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

నియంత్రణ కరువు

పేరుకే జాతీయ రహదారి కానీ పూర్తిగా ఇరుకు రోడ్డు. దీనికి తోడు వ్యాపార, వాణిజ్య సంస్థల ఎదు ట వాహనాల నిలిపివేత. పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు వెళ్లేవారు బస్సుకోసం నిరీక్షణ. వెరసి బాటసారులకు ఇబ్బందిగా మారింది. రోడ్డు వెంట నడవలేరు. రోడ్డును దాటలేరు. యూటర్న్‌లు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి వేగ నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు.. రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్‌ను అరికట్టి, పాద చారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్: మండల పరిధి రావిచేడ్ గ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూ.5 వేలు, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహలు రూ.6 వేలు సమకూర్చి మొత్తం రూ.11 వేలు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జనార్దన్‌గౌడ్, పారేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రూపేందర్, రామచందర్, రాజు, యాదయ్య ఉన్నారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత



పూజా కార్యక్రమంలో భక్తులు

ఆమనగల్లు: ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కల్వకుర్తి మండలాలలో శనివారం ఆయన పర్యటించారు. లింగసానిపల్లి పునర్నిర్మాణంలో ఉన్న శివాలయం, రామాలయాలను సందర్శించారు. ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంత చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రచ్చ శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, రాములు, శేఖర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ



పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న శాంతిశ్రీ

మహేశ్వరం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శనివారం మండల పరిధి తుమ్మలూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన శిశువుకు వెంటనే ముర్రుపాలు పట్టిస్తే తల్లికి గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ రాదని చెప్పారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు. అనంతరం 6 నెలల లోపు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులు, తల్లులకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమా చెక్కుల అందజేత

తుక్కుగూడ: తుక్కుగూడ పురపాలిక పరిధిలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసిన ఎర్రోళ్ల అంజయ్య, వారణాసి రాములు అనారోగ్యంతో మృతి చెందారు. అంజయ్యకు ఈపీఎఫ్ కింద మంజూరైన రూ.5,46,780, రాములకు ఆయుష్మాన్ భారత్ కింద మంజూరైన బీమా రూ.5 లక్షల చెక్కులను బాధిత కుటుంబీకులకు శనివారం మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు.. నేడు మేమే ఇచ్చాం

- పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డులు ఇచ్చాము. ఇప్పుడు తమ హయాంలోనే పంపిణీ జరుగుతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ మధ్య పదేళ్ల కాలంలో తెలంగాణను పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ.. ఏ ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. శనివారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పలువురికి ఆయన నూతన రేషన్ కార్డులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇతర పథకాలు అందజేస్తామని తెలిపారు. అర్హత ఉండి కార్డు రాలేదన్న ఫిర్యాదు రావొద్దని, అర్హులందరికీ కార్డులు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హై'టెన్షన్' పడుతున్నాం.. న్యాయం చేయండి

ఎమ్మెల్సీ మల్లన్నను వేడుకున్న రైతులు

కడ్తాల్: వ్యవసాయ పొలాల మీదుగా తీస్తున్న 765 కేవీ బీదర్– మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్‌లైన్‌తో తమకు తీవ్ర నష్టం కలగనుందని, న్యాయం జరిగేలా చూడాలని బాధిత రైతులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కోరారు. శనివారం నగరంలో ఆయనను కలిసి సమస్యను వివరించారు. కడ్తాల్ మండల కేంద్రంతో పాటు, పరిధి గ్రామాల్లోని పంట పొలాల మీదుగా లైన్ తీస్తున్నారని పేర్కొన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మండల అధ్యక్షుడు వెంకటేశ్, రైతులు రామకృష్ణ, పెంటారెడ్డి, కుమార్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, గంట శ్రీనివాస్, శివశంకర్, రాములుయాదవ్, పర్వత్ కుమార్‌యాదవ్, మహేశ్, కేశవులుగౌడ్, అభిలాష్ రెడ్డి, రాజు, కృష్ణయాదవ్ ఉన్నారు.



ఎమ్మెల్సీతో మాట్లాడుతున్న బాధిత రైతులు

నాణ్యతలో మేటి భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు బహుమతులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధి

ఇబ్రహీంపట్నం రూరల్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తింగా భారతి సిమెంట్ పేరు ప్రఖ్యాతులు పొందిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహమ్మద్ సాహేర్ అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్‌లో స్నేహ స్టీల్, సిమెంట్ ట్రేడర్ డీలర్‌షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. స్లాబ్ కాంక్రెట్ సమయంలో సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని చెప్పారు. ఇతర సిమెంట్ల కంటే రూ.20 అధికంగా ఉంటుందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ చల్మారెడ్డి మాట్లాడుతూ.. సంస్థ సర్వీస్ బాగుందని కితాబు ఇచ్చారు.

సర్కారు బడుల బలోపేతానికి సహకరించండి



పాఠశాల ఆవరణలో విద్యార్థులు, దాతలతో ఎంఈఓ పాండు

మండల విద్యాధికారి పాండు

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావాలని మండల విద్యాధికారి పాండు కోరారు. ఆమనగల్లు మండలం గౌరారం గ్రామం ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన న్యాలపట్ల నరేందర్‌రెడ్డి రూ.50 వేలు, గౌరారం వాసులు శ్రీపాతి వినోద్‌రెడ్డి రూ.30 వేలు, శెట్టిపల్లి రాకేశ్‌రావ్ రూ.10 వేలు, దోనాదుల వెంకట్రాములు రూ.8 వేలు అందజేశారు. అలాగే చిన్నారులకు వెంకటాపురం శివ టై, బెల్టులు, ఐడీ కార్డులు అందించగా, శెట్టిపల్లి వీరేశం పాఠశాలకు బ్యాండ్ వితరణ చేశారు. రాఘవేందర్ దేశ నాయకుల చిత్రపటాలను బహూకరించారు. అనంతరం దాతలను విద్యాధికారి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని, మీ పిల్లలను చేర్పించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసచారి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీలో జోష్

కేంద్ర మంత్రి పర్యటనలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా స్థాయినేతలు

యాచారం: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి రాకతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, బొక్క నర్సింహారెడ్డి, కొప్పు బాషా, లచ్చిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్, మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య, బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, మాజీ మండల అధ్యక్షులు రవీందర్, రాజు, మేకల యాదగిరిరెడ్డి, యాచారం పీఏసీఎస్ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, యాచారం మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో కేంద్ర మంత్రి రాక పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజం నింపిందని పలువురు పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎంపీపీ సుకన్య

చికిత్స పొందుతూ మహిళ మృతి

యాచారం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంచాల మండలం కాగజ్‌ఘాట్ గ్రామానికి చెందిన శివ యాచారం పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జూలై 29న ఆయన భార్య సుజాత(42) శివను కలవడానికి యాచారానికి వచ్చింది. ఇద్దరు కలిసి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో యాచారం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో సుజాత బైక్‌పై నుంచి జారి పడి పోయింది. తీవ్ర గాయాలైన ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.